ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

# తెలంగాణ కథా సాహిత్యం – విశ్వకర్మల జీవన చిత్రణ

నన్నె నరేశ్
స్కూల్ అసిస్టెంట్ తెలుగు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఖమ్మంపల్లి
చరవాణి : 9949981091
Mail id: nareshvashrika@gmail.com

Received: 25/05/2026
Article Accepted: 22/06/2026
Published Online: 24/06/2026
DOI:10.53414/Sahithyatharangini.2026.3.2.193

**పరిచయం:**

తెలంగాణ సమాజంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ శతాబ్దాల తరబడి స్వయంపోషకంగా నిలబడటంలో కులవృత్తులు కీలకమైన పాత్రను పోషించాయి.ఈ వ్యవస్థలో వడ్రంగి, కమ్మరి, కంచరి, శిల్పి, స్వర్ణకారుడు అనే ఐదు శాఖలుగా విస్తరించిన విశ్వకర్మలు గ్రామ జీవనానికి వెన్నెముకగా నిలిచారు. వ్యవసాయానికి అత్యంత ఆవశ్యకమైన నాగలి,గొర్రు,గుంటుకలను వడ్రంగి మరియు కమ్మరి సమకూరిస్తే,నిత్యజీవితంలో వాడే ఇత్తడి,రాగి పాత్రలను కంచరివారు తయారుచేసేవారు. దేవాలయ నిర్మాణాలకు, గృహాలకు అవసరమైన అద్భుత శిల్పాలను శిల్పులు చెక్కితే, సామాజిక ఆచార వ్యవహారాలలో ప్రాధాన్యత కలిగిన తాలిబొట్టు,మెట్టెలు వంటి ఆభరణాలను స్వర్ణకారులు రూపొందించేవారు. ఈ విధంగా ఉత్పత్తి రంగంలోనూ,సంస్కృతి నిర్మాణంలోనూ విశ్వకర్మలు అగ్రగామిగా నిలిచారు.అయితే,ఆధునిక యుగంలో ప్రవేశించిన పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ, మరియు యాంత్రీకరణల త్రివేణీ సంగమం ఈ సంప్రదాయ కులవృత్తుల పునాదులను తీవ్రంగా కదిలించివేసింది. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు వంటి ఆధునిక యంత్రాల రాకతో వడ్రంగి, కమ్మరి వృత్తులు ప్రాభవాన్ని కోల్పోయాయి. ప్లాస్టిక్, స్టీల్, అల్యూమినియం వస్తువుల విస్తృతితో కంచరి వృత్తి నామరూపాలు లేకుండా పోయింది. గ్లోబలైజేషన్ కారణంగా ఆభరణాల రంగంలోకి బహుళజాతి కార్పొరేట్ కంపెనీలు ప్రవేశించడంతో స్థానిక స్వర్ణకారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ఈ చారిత్రక సామాజిక విధ్వంసాన్ని, మానవీయ కోణంలో తెలంగాణ కథా సాహిత్యం అత్యంత హృదయవిదారకంగా నమోదు చేసింది.

వ్యవసాయం సంక్షోభంలో పడితే దానికి అనుబంధంగా ఉన్న కులవృత్తులు ఏ విధంగా కుప్పకూలుతాయో వుప్పల నరసింహం రాసిన **పడావుపన్ను** కథ అద్దం పడుతుంది.వర్షాలు పడక,

పంటలు పండని కరువు కాలంలో రైతాంగంతో పాటు వడ్రంగి వృత్తిదారులు పడే ఆకలి బాధలు ఈ కథలో ప్రధానాంశం. సంప్రదాయ మేర(పంట కోత తర్వాత వృత్తిదారులకు ఇచ్చే ధాన్యం)పద్ధతి అంతరించడంతో వడ్ల బ్రహ్మయ్య కుటుంబం తినడానికి తిండి లేక అలమటిస్తుంది. సమాజంలో ఒకవైపు ప్రకృతి కరువు, మరోవైపు సామాజిక దోపిడీ వృత్తిదారులను ఎలా పీల్చి పిప్పి చేస్తాయో రచయిత ఇక్కడ హృద్యంగా చిత్రించారు. వరిచేను కోసినంక పోయిన కారులు, ఈ కారులు ఒడ్లు తీసుకున్నాక నీతోవ నీది నాతోవ నాది, నాకు నువ్వు నాగండ్లు చేయవద్దు అని దంతెనాగలి భుజంమీద వేసుకొని పొలందారి పట్టే మల్లారెడ్డి లాంటి రైతుల ప్రవర్తన ఇందుకు నిదర్శనం. ఈ పరిస్థితి వృత్తిదారులకు, రైతాంగానికి మధ్య శతాబ్దాలుగా ఉన్న పరస్పర ఆధారిత బంధం ఎలా తెగిపోయిందో చూపిస్తుంది. పైగా,పండని భూములకు కూడా కరణం ప్రహ్లాదరావు వంటి స్వార్థపరులు అనధికారికంగా పడావు పన్ను వసూలు చేయడం వ్యవస్థలోని క్రూరత్వానికి పరాకాష్ఠ.ఇంట్లో పిల్లల ఆకలిని తీర్చడానికి, పన్ను కట్టడానికి వేరే దారి లేక బ్రహ్మయ్య మల్లారెడ్డికి సంబంధించిన పాత నాగలిని వేరొకరికి అమ్ముకోవాల్సి వస్తుంది. దీనివల్ల యజమాని అయిన మల్లారెడ్డి చేతిలో బ్రహ్మయ్య అమానుషంగా దెబ్బలు తిని,రక్తం ఓడుతున్న దృశ్యం తెలంగాణ పల్లెల్లో వృత్తిదారులు అనుభవించిన సామాజిక అభద్రతను, అవమానాలను చాటిచెబుతుంది.

యాంత్రీకరణ సవాలు మరియు ఆత్మగౌరవ పోరాటాన్ని చొప్పదండి సుధాకర్ రచించిన **నవ్వేబొమ్మ-ఏడ్చేబొమ్మ** కథ ఆధునిక మార్పుల నేపథ్యంలో వృత్తిదారుల మానసిక సంఘర్షణగా ఆవిష్కరించింది. ఒకప్పుడు మూడు వందల గడపలున్న ఊరికి ఏకైక వడ్రంగి, కమ్మరిగా వెలిగిన లస్మయ్య కాలం నాటి వైభవాన్ని అతని కొడుకు నర్సయ్య గుర్తుచేసుకోవడం ద్వారా కథ నడుస్తుంది.నాటి కాలంలో వృత్తి నైపుణ్యానికి సమాజంలో ఎంతటి గౌరవం, మర్యాదలు ఉండేవో, కట్నాలు కానుకలతో ఇల్లు ఎలా కళకళలాడేదో రచయిత ఎంతో నేర్పుతో సృజించారు. కానీ నేడు పారిశ్రామికీకరణ వల్ల ఆ వృత్తి కేవలం కొన్ని కొడవళ్లకు పిడి వేసే స్థాయికి పడిపోయింది. ఇక్కడ కథలోని ప్రధాన ఘట్టం వృత్తిదారుని ఆత్మగౌరవానికి సంబంధించింది. సిద్దిపేటలో తలుపులు చేసే పని ఉందని, రోజుకు రెండు వందల రూపాయల కూలి దొరుకుతుందని మల్లేష్ చెప్పినప్పుడు, నర్సయ్య భార్య కమలమ్మ ఒకరి కింద చాకిరీ కుదరదని, రాజువోలె బతికిన తాము తిన్న ఉపాసమున్నా ఊరే చేసుకొని బతుకుతామని తిరస్కరించడం వృత్తిదారుల అంతర్గత ఆత్మగౌరవానికి ప్రతీక. అయితే ఆకలి, అప్పులు మనిషిని ఆత్మహత్య వైపు ప్రేరేపిస్తాయనే సామాజిక భయాన్ని రచయిత నర్సయ్య కొడుకు సంతోష్ ద్వారా వ్యక్తంచేశారు.**"నువ్వు చచ్చిపోతావా? ఊళ్ళో అందరూ అనుకుంటున్నారు నాన్న. వాడొట్టి వెరికివాడు సంసారం**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

**చేయశాతగాదు. ఎప్పుడో ఏ రాత్రో ఉరేసుకొని చస్తాడని కిరాణ దుఖాణం సత్తయ్యకు వెయ్యి రూపాయాలు బాకీ ఉన్నావట కదా! నాకు ఏడుపొచ్చింది. వారు నిన్ను అన్ని మాటలు అంటుంటే "అందుకే నాన్న! నువ్వు చచ్చిపోతావేమోనని భయంతో రోజు రాత్రి నిద్రపోవడం లేదు. ఎంత నిద్రొచ్చిన ఆపుకుంటున్నాను"(*పుట.65,తెలంగాణ సోయి త్రైమాసిక సాహిత్య పత్రిక.*)** అన్న కొడుకు భయాన్ని చూసి చలించిపోయిన నర్సయ్య, ఆత్మహత్య పిరికితనం అని గ్రహించి, బతకడానికి ఏ ఊరైతే ఏంది, ఏ ప్రాంతమైతే ఏంది అన్న సత్యాన్ని తెలుసుకొని నూతన వలస కూలీగా మారతాడు. కులవృత్తి నైపుణ్యాన్ని వదలకుండానే మారుతున్న కాలానికి అనుగూణంగా శ్రమను అమ్ముకోవడంలో తప్పులేదని ఈ కథ సానుకూల దృక్పథాన్ని అందిస్తుంది.

ప్రపంచీకరణ మరియు కార్పొరేట్ శ్రమ దోపిడీని ఐతా చంద్రయ్య రాసిన **రంగుల రవ్వల నెక్లెస్** కథ స్వర్ణకారుల జీవితాల్లోని తీవ్ర సంక్షోభంగా, ధనస్వామ్య సమాజంలోని నైతిక పతనంగా నిలదీస్తుంది. పట్టణాలలో వెలిసిన కార్పొరేట్ రెడీమేడ్ షోరూమ్‌ల వల్ల పల్లెటూరి స్వర్ణకారులకు పనులు లేకుండా పోయాయి. ఇటువంటి స్థితిలో ఉన్న బ్రహ్మచారి అనే స్వర్ణకారునికి ఊరి ధనవంతుడైన లక్ష్మీపతి తన రెండో భార్య రంభ కోసం నెక్లెస్ చేసే పనిని ఇస్తాడు.శ్రమను ధనవంతులు ఎంత చులకనగా చూస్తారో లక్ష్మీపతి బేరసారాల ద్వారా వ్యక్తమవుతుంది. నగరంలో వెయ్యి రూపాయలు పలికే సున్నితమైన శ్రమకు కేవలం మూడు వందల రూపాయలు ఇవ్వడానికి లక్ష్మీపతి సిద్ధపడటం శ్రమ దోపిడీకి నిదర్శనం. రంగురంగుల రాళ్లు పొదిగిన తొమ్మిది బిల్లల రంగుల రవ్వల నెక్లెస్ మధ్య బిళ్ళలో కమలంలోంచి ఉదయిస్తున్న బాల భాస్కర కిరణాల అందం వెనుక, ఒక్కో రాయి పొదిగేందుకు వందల చెమట బిందువులు రాలిన శ్రామికుడి శక్తియుక్తులు దాగున్నాయి. బ్రహ్మం తన రక్తాన్ని చెమటగా మార్చి, తపోదీక్షతో అద్భుతమైన నెక్లెస్ తయారుచేసినా, లక్ష్మీపతి కూలి డబ్బులు ఎగ్గొట్టడానికి పన్నిన కుట్ర అత్యంత భయంకరమైనది. బ్రహ్మం తన భార్యాపిల్లల ఆకలి కోసం కూలి డబ్బులు అడిగితే, అతనిపై తన భార్యను మానభంగం చేయబోయాడనే నింద మోపి, శారీరకంగా హింసించి, పోలీస్ స్టేషన్ భయంతో బజారులోకి తోసివేయడం సమాజంలోని ఫ్యూడల్, ధనస్వామ్య అహంకారానికి అద్దం పడుతుంది. అయితే, ఈ కథలో రచయిత రంభ పాత్ర ద్వారా స్త్రీ శక్తిని, ఆత్మాభిమానాన్ని చాటారు. కట్టుకున్న మొగుడైనా అధర్మాన్ని సపోర్ట్ చేయకుండా, కత్తి పట్టి లక్ష్మీపతిని నిలదీసి బ్రహ్మంకు న్యాయం చేకూర్చడం కథలో ఒక విప్లవాత్మకమైన ముగింపును ఇస్తుంది.

దిలావర్ రచించిన **గూడు చెదిరి** కథ కులవృత్తుల విధ్వంసం వల్ల గ్రామీణులు ఎదుర్కొంటున్న వలసల విషాదాన్ని, పారిశ్రామికీకరణ వల్ల మనుషుల మధ్య తెగిపోతున్న మానవ సంబంధాలను తాత్త్విక కోణంలో ఈ కథ విశ్లేషిస్తుంది. ఒకప్పుడు గ్రామంలో ఎంతో గౌరవంగా, మహారాజులా బతికిన ముత్తిలింగం అనే వడ్రంగి, యాంత్రీకరణ కారణంగా గూడు చెదిరి పట్నానికి వలస వస్తాడు. ఒక కార్పొరేట్ ఫర్నిచర్ షాపులో జీతానికి కూలీగా చేరిన ముత్తిలింగం అనుభవించే పరాయీకరణ ఈ కథలో హృద్యంగా చిత్రీకరించబడింది. కార్పొరేట్ హాల్లో ఉన్న దుగోడ, పేపర్, టర్నింగ్, డిజైన్ కటింగ్ వంటి ఆధునిక మిషన్ల మధ్య ముత్తిలింగం ఒక యంత్రంలా మారిపోతాడు. తన చిన్ననాటి పచ్చని పల్లెటూరు, వాగులు, వంకలు,నిండు చెరువులు ఎలా స్మశానాలుగా మారాయో తలుచుకుంటూ అతను పడే వేదన వర్ణనాతీతం. ఆధునిక లగ్జరీ వస్తువులైన ముంబాయి సోఫాలు,డైనింగ్ టేబుళ్లు లేకపోతే మనిషి మనుగడ సాగదా,సబండ వర్ణాల కడుపు నింపే సంప్రదాయ పనిముట్లను మింగేసిన ఈ యంత్రాలు ఎవరి కోసం అనే తాత్త్విక ప్రశ్నలను రచయిత ముత్తిలింగం ద్వారా సంధించారు. పట్నంలోని మురికివాడలో చిన్న ఇనుప గుడిసెలో,కనీసం వంగి దూరడానికి కూడా స్థలం లేని దీన స్థితిలో బతకడం వలస జీవుల దుర్భరత్వానికి సాక్ష్యం. ముత్తిలింగం ఇద్దరు కొడుకులు కూడా చదువుకు దూరమై, ఆ షాపులోనే చాయ్ లు అందిస్తూ, వార్నిషు పూస్తూ బాల కార్మికులుగా మారడం వృత్తిదారుల భవిష్యత్తు ఎంతటి అంధకారంలో పడిందో సూచిస్తుంది.

విధ్వంసానికి పరాకాష్ఠగా మేరెడ్డి యాదగిరి రెడ్డి రచించిన **కొలిమి** కథ నిలుస్తుంది. ఆధునిక సాంకేతికత గ్రామీణ స్వయంపోషకత్వాన్ని ఎలా దెబ్బతీసిందో ఈ కథ కళ్ళకు కడుతుంది. కథలో కమ్మరి, వడ్రంగి అయిన వీరబ్రహ్మం మరియు అతని కొడుకులు రామాచారి,వీరాచారి గ్రామంలోని రైతులందరికీ ఎంతో నిష్ఠతో, శ్రమతో వ్యవసాయ పనిముట్లను తయారుచేసి ఇస్తుంటారు.ఒకప్పుడు వారి కొలిమి దగ్గర నిరంతరం కాయకష్టం చేస్తూ,ఊరి నిండా కళకళలాడుతూ ఉండేవారు. కానీ గ్రామంలోకి పెద్దదొర కొండారెడ్డి ట్రాక్టర్ తీసుకురావడంతో అంతటా మార్పు మొదలవుతుంది. ట్రాక్టర్ల విస్తృతి, ఆపై వచ్చిన రైస్ ప్లాంటేషన్, హార్వెస్టర్ మిషన్ల వల్ల సంప్రదాయ నాగళ్లు,గొర్రుల వాడకం పూర్తిగా తగ్గిపోతుంది. దీనితో వీరబ్రహ్మం కొలిమి చల్లబడిపోతుంది.ఉపాధి కోల్పోయిన పెద్దకొడుకు రామాచారి పట్నంలోని కట్టెల మిల్లులో నౌకరీకి చేరితే,చిన్నకొడుకు వీరాచారి బొగ్గుల ఫ్యాక్టరీలో శ్రామికుడిగా మారుతాడు.వారికి సహాయంగా ఉండే మాదిగ లింగస్వామి బొంబాయికి వలసపోతాడు. వృత్తి అంతరించిపోయాక,ముసలితనంలో అనారోగ్యంతో ఉన్న భార్య సుశీలమ్మ మందుల కోసం వీరబ్రహ్మం తన ప్రాణప్రదమైన పెద్దబాడిశెను, ఇనుప ధాకలిని

సంచిలో వేసుకొని అమ్ముకోవడానికి బయలుదేరడం సంప్రదాయ వృత్తుల అంతిమ శ్వాసకు ప్రతీకగా నిలుస్తుంది.

ప్రకృతి వనరుల లూటీ మరియు శిల్పుల విధ్వంసాన్ని కె.వి. నరేందర్ రచించిన **బండలు** కథ సరికొత్త కోణంలో ఆవిష్కరించింది.కేవలం యంత్రాల రాక మాత్రమే కాదు, పల్లెల్లోని ప్రకృతి వనరులను ఫ్యూడల్ శక్తులు,పెట్టుబడిదారులు ఎలా లూటీ చేసి వృత్తిదారుల పొట్ట కొడుతున్నారో ఈ కథ వివరిస్తుంది.తరతరాలుగా వస్తున్న శిల్ప వృత్తిని నమ్ముకున్న వీరాచారి,ఊరి బోడగుట్ట నుండి బండలను సేకరించి,విగ్రహాలు చెక్కుతూ జీవనం సాగిస్తుంటాడు.విగ్రహాల తయారీ కోసం అడ్వాన్స్ తీసుకుని ఎంతో భక్తిశ్రద్ధలతో పని ప్రారంభిస్తాడు.కానీ, ఊరి సర్పంచ్ ఆ బోడగుట్టను స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు పెట్టుబడిదారులకు అమ్మేస్తాడు. దీనివల్ల గుట్టపై శిల్పులకు హక్కు లేకుండా పోతుంది. శిల్పకళకు జీవం పోయడానికి అవసరమైన రాయి దొరక్క వీరాచారి జీవితం ఎలా నాశనమైందో ఈ కథ చూపిస్తుంది.

**ముగింపు :**

తెలంగాణ కథా సాహిత్యం చిత్రించిన విశ్వకర్మల జీవన చిత్రణ కేవలం కొన్ని కథల సమాహారం కాదు. అది ఒక సామాజిక చారిత్రక పరిణామ క్రమంలోని విషాద దొంతరలు.వడ్రంగి, కమ్మరి, కంచరి, శిల్పి, స్వర్ణకారుల జీవితాలన్నీ ప్రపంచీకరణ సృష్టించిన సునామీలో కొట్టుకుపోయాయి.ఈ కథలన్నీ ఒకఉమ్మడి సత్యాన్ని ప్రకటిస్తున్నాయి మారుతున్న కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం కాదనలేము, కానీ ఆ సాంకేతికత వల్ల ఉపాధి కోల్పోయిన లక్షలాది మంది సంప్రదాయ వృత్తిదారుల పునరావాసం గురించి వ్యవస్థ ఆలోచించకపోవడం పెద్ద వైఫల్యం.సమాజంలో శ్రమకు దక్కాల్సిన గౌరవం దక్కకపోవడం,శ్రమ దోపిడీకి గురికావడం, అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడటం లేదా నగరాల శివార్లలోని మురికివాడల్లో వలస కూలీలుగా మారి అస్తిత్వాన్ని కోల్పోవడం నేటికీ కొనసాగుతున్న నిజాలు.ఈ కళాకారుల హస్తకళా నైపుణ్యాలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసి, వారికి తగిన మార్కెటింగ్ సదుపాయాలు, ఆర్థిక వనరులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.అప్పుడే కొలిమి మళ్ళీ వెలుగుతుంది, ఏడ్చేబొమ్మ నవ్వేబొమ్మగా మారుతుంది. తెలంగాణ కథలు ఈ సామాజిక చైతన్యాన్ని రగిలించడంలో సంపూర్ణంగా విజయవంతమయ్యాయి.

**ఆధార గ్రంథాలు**

చంద్రయ్య ఐతా, నిశ్చితార్థం (కథ సంపుటి) స్వీయ ప్రచురణ, సిద్దిపేట, 2003.
నరసింహం వుప్పల, సబ్బండ వర్గాల సారస్వతం, జ్ఞానం పబ్లికేషన్స్, హైదరాబాద్, 2017.

నరేందర్ కె.వి. ఊరు (కథా సంపుటి) స్వీయ ప్రచురణ, జగిత్యాల, 2005.
రామచంద్ర దార్ల, కిర్రు చెప్పులు (కథా సంపుటి) విశాల సాహిత్య అకాడమీ, జగిత్యాల, 2001.
సుజాతా రెడ్డి ముదిగంటి, తెలంగాణ తొలితరం కథలు, రోహణన్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2002.
తెలంగాణ సోయి, త్రైమాసిక సాహిత్య పత్రిక డిసెంబర్, 2007